క్లుప్తంగా

విద్యార్థులకు బహుమతుల పంపిణీ



విజయపురి సౌత్: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సమ్మేటివ్-1 పరీక్షలలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు పూర్వ విద్యార్థిని హైమావతి తల్లిదండ్రులు మేడికొండూరి రోశయ్య, నాంచారమ్మ జ్ఞాపకార్థం గురువారం నగదు బహుమతులతో పాటు దేశ నాయకుల పుస్తకాలను అందజేశారు. 10వ తరగతిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలలో నిలిచిన విద్యార్థులకూ బహుమతులు అందజేస్తామని ఆమె తెలిపారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థి బత్తెన శ్రీనివాసబాబు, పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ ధర్మవరపు సుబ్రహ్మణ్యం, ఇన్‌చార్జి హెచ్‌ఎం యు. లక్ష్మి, డాక్టర్ కాకర్ల రమణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరస్పర దాడిలో ఇద్దరికి గాయాలు

దుర్గి: వ్యక్తిగత కక్షలతో ఇరువర్గాల పరస్పర దాడిలో గురువారం ఇద్దరికి గాయాలయ్యాయి. మండలంలోని జంగమహేశ్వరపాడు గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై దుర్గి వస్తుండగా కోలగుట్ల రోడ్డులోని డాల్ మిల్ సమీపంలో అదే గ్రామానికి చెందిన వ్యక్తులతో ఘర్షణ జరిగింది. వాగ్వాదం పెరగడంతో దాడికి పాల్పడ్డారు. ఇందులో గాజుల అంజి, పాశం రాజులకు గాయాలయ్యాయి. వీరిని మాచర్ల ప్రభుత్వాసుపత్రికి బంధువులు తీసుకెళ్లారు. వైద్యులు ప్రథమ చికిత్స చేశారు.

నేడు బాలదాసు ఆరాధన మహోత్సవం

కుందురువారిపాలెం(ముప్పాళ్ల): మండలంలోని కుందురువారిపాలెంలో శ్రీ శెట్టిపల్లి బాలదాసు సద్గురువుల 89వ ఆరాధన మహోత్సవాన్ని శుక్రవారం నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు సాకి హరికృష్ణ గురువారం తెలిపారు. కార్యక్రమంలో భాగంగా ఆలయంలో హరేరామ నామ సంకీర్తన చేపట్టారు. ఆరాధనలో భాగంగా అన్నదానం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

స్థల వివాదంలో పరస్పర దాడులు

క్రోసూరు: మండలంలోని బయ్యవరంలో ఓ స్థల వివాదంలో పరస్పర దాడుల ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ షేక్ షఫీ గురువారం తెలిపారు. గత 10 సంవత్సరాలుగా నడిచే దారి విషయం కోర్టులో విచారణలో ఉన్న నేపథ్యంలో బుధవారం ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకొంది. ఇరువైపులా ఐదుగురికి తీవ్రగాయాలు కాగా ఆసుపత్రి నుంచి ఇరువర్గాలు ఇచ్చిన ఫిర్యాదుల మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చెప్పారు. మండలంలోని బయ్యవరం గ్రామానికి చెందిన తులం కోటేశ్వరరావు ప్రత్యర్థి వర్గానికి చెందిన ఆళ్ల వెంకటేశ్వర్లు, మరో పదకొండు మంది తనను, సోదరుడు తులం వెంకటరావులపై కత్తులు, కర్రలతో దాడి చేయగా సత్తెనపల్లి ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు ఫిర్యాదు చేశారు. ప్రత్యర్థి వర్గం ఆళ్ల వెంకటేశ్వర్లు కూడా తులం కోటేశ్వరరావు , మరో 13 మంది దాడి చేసి ఇనుపరాడ్లతో కొట్టగా తనతో పాటు, తల్లి ఆళ్ల నారాయణమ్మ, సోదరుడు శ్రీనులకు తీవ్ర గాయాలు కాగా గుంటూరు జీజీహెచ్ లో చికిత్స పొందుతూ ఫిర్యాదు చేశారు.

సమన్వయంతో ఉపాధ్యాయులు పని చేయాలి

యడ్లపాడు: పదో తరగతి ఉత్తీర్ణతలో పల్నాడు జిల్లాను ముందుండేలా ఉపాధ్యాయులు సమన్వయంతో కృషి చేయాలని నరసరావుపేట డీవైఈవో కె. వేణుగోపాలరావు చెప్పారు. పాఠశాల వార్షిక తనిఖీల్లో భాగంగా మండలంలోని వంకాయలపాడు జెడ్పీ హైస్కూల్‌ను గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల అన్ని రికార్డులను పరిశీలించారు. అనంతరం 9, 10వ తరగతి విద్యార్థులతో సమావేశమయ్యారు. ప్రణాళిక ప్రకారంగా పరీక్షలకు సిద్ధం కావాలని సూచించారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని, మన బడి నాడు-నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు పూర్తిగా మార్చారన్నారు. ప్రభుత్వ లక్ష్యాన్ని నేరవేర్చడంలో ఉపాధ్యాయులు అంకితభావంతో పని చేయాలని డీవైఈవో సూచించారు.

పారదర్శకంగా ఓటరు జాబితా తయారీకి చర్యలు

పెదకూరపాడు: ఓటరు జాబితా పారదర్శకంగా తయారు చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి నాగజ్యోతి అన్నారు. ఓటరు జాబితాల్లో డబుల్ ఎంట్రీలు, మృతుల ఓట్లపై బూత్ లెవెల్ అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఓటరు ముసాయిదా విడుదల చేసిన నాటి నుంచి ఫారం-6 1449, ఫాం-7 1045, ఫారం-8 482 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారని ఆమె చెప్పారు. వాటిని క్షుణ్ణంగా పరిశీలిస్తున్నట్లు చెప్పారు. 21 సంవత్సరాల పైబడి వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న తర్వాత వారి నుంచి డిక్లరేషన్ తీసుకొని నమోదు చేసుకోవాలని ఆమె బీఎల్‌ఓలకు సూచించారు.

సేవాలాల్ మహరాజ్ ఆలయ అభివృద్ధికి కృషి

కలెక్టర్ లోతోటి శివశంకర్



కలెక్టర్ శివశంకర్‌ను సన్మానిస్తున్న ఆలయ ధర్మకర్త పాండునాయక్



భూమి పూజలో పాల్గొన్న ఏబీఎస్‌ఎస్ యూత్ ప్రెసిడెంట్ రాంబాబు నాయక్

విజయపురి సౌత్: స్థానిక సంత్ సేవలాల్ మహరాజ్ ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని జిల్లా కలెక్టర్ లోతోటి శివశంకర్ తెలిపారు. ఆలయంలో ఆయన గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సేవలాల్ మహరాజ్ 285వ జయంతి సందర్భంగా ఆలయంలో మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాలను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ గిరిజనుల ఆరాధ్య దైవమైన సేవలాల్ మహరాజ్ ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. సేవాలాల్ జయంతి సందర్భంగా ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయం అన్నారు. శనివారం జరిగే ఉచిత వైద్య శిబిరాన్ని పరిసర ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. అనంతరం ఆలయ ధర్మకర్త కె.పాండు నాయక్ ఆధ్వర్యంలో కలెక్టర్‌ను ఘనంగా సన్మానించారు.పలువురు గిరిజనులు తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకురాగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మంజునాథరెడ్డి, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయి మార్కొండారెడ్డి, మాచర్ల జెడ్పీటీసీ సభ్యుడు మల్లు స్వామి, కళ్లకుంట మాజీ సర్పంచ్ బాలాజీ నాయక్, అటవీ హక్కుల పరిరక్షణ చైర్మన్ రంగా నాయక్, కళ్యాణ్ నాయక్, కేపీ గూడెం సర్పంచ్ పాండు నాయక్, అపోలో హాస్పిటల్ వైద్యుడు యుగంధర్, రవీందర్, కె. పాండు నాయక్ పాల్గొన్నారు.

విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ

పిడుగురాళ్ల: సత్‌గురు సంపత్ శ్రీ సేవాలాల్ మహరాజ్ 285 జయంతి సందర్భంగా విగ్రహ నిర్మాణానికి భూమి పూజను గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏబీఎస్‌ఎస్ యూత్ ప్రెసిడెంట్ రాంబాబు నాయక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుగాలీలకు కూడా చట్ట సభల్లో అవకాశం కల్పించాలని కోరారు. అనంతరం పట్టణంలో గాంధీ సుగాలి సేవా సంఘం స్కూల్ ఎదురుగా ఉన్న రోడ్డు డివైడర్ వద్ద సేవాలాల్ విగ్రహ ప్రతిష్ఠకు భూమి పూజను నిర్వహించారు. కార్యక్రమంలో 6వ వార్డు కౌన్సిలర్లు అజ్మీర శారదబాయి, అప్పిరెడ్డి, కొక్కెర శ్రీను, నాయకులు శ్రీనివాసనాయక్, రాజునాయక్ , మాణ్యానాయక్, చందు నాయక్, రంగా నాయక్, సక్రునాయక్, సత్యం నాయక్, బాలాజీ నాయక్, రాముూ నాయక్, సాయినాయక్ పాల్గొన్నారు.

108లో ప్రసవం.. తల్లీబిడ్డా క్షేమం



కారెంపూడి: 108 వాహనంలో ప్రసవం జరిగి తల్లీబిడ్డా క్షేమంగా ఉన్న ఘటన గురువారం జరిగింది. బొల్లాపల్లి మండలం రాజానగర్ తండాకు చెందిన ఎం లక్ష్మీబాయి పురిటి నొప్పులతో బాధపడుతుండగా 108లో గురువారం తెల్లవారు జామున కారెంపూడి పీహెచ్‌సీకి తరలిస్తున్నారు. మార్గంమధ్యలో కారెంపూడి రోడ్డుకు చేరగానే పురిటి నొప్పులు ఎక్కువ కావడంతో సిబ్బంది వాహనాన్ని రోడ్డు పక్క నిలిపి, కుటుంబానికి చెందిన మహిళల సాయంతో కాన్పు చేయించారు. మగ బిడ్డ పుట్టాడు. ప్రసవం అనంతరం తల్లీబిడ్డలను కారెంపూడి పీహెచ్‌సీకి తరలించారు. ప్రస్తుతం ఇద్దరు క్షేమంగా ఉన్నారు. కాన్పు చేయించిన ఈఎంటీ బత్తుల సురేష్‌బాబు, పైలెట్ సుందర్‌సింగ్ నాయక్‌లకు లక్ష్మీబాయి కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు. ఇదిలా ఉంటే ఆమె ఇది నాలుగో కాన్పు.

ఘనంగా పీఆర్కే జన్మదిన వేడుకలు

ముఖ్య అతిథిగా హాజరైన మాజీ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్



మాజీ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్‌తో కలిసి కేక్ కట్ చేస్తున్న పీఆర్కే, పీవీఆర్, వెంకటేశ్వరరెడ్డి

మాచర్ల: పల్నాడు జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి జన్మదిన వేడుకలు గురువారం ఉదయం నుంచి ఘనంగా జరిగాయి. మాజీ మంత్రి, నర్సరావుపేట పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి అనిల్‌కుమార్ యాదవ్ ముఖ్య అతిథిగా పాల్గొని పీఆర్కేకు శుభాకాంక్షలు తెలిపారు. అంబేడ్కర్ సెంటర్‌లో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు భారీ స్థాయిలో ఏర్పాటు చేసిన 250 కేజీల కేక్‌ను అనిల్ కుమార్ యాదవ్, ప్రభుత్వ విప్ పీఆర్కే, వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన ఉపాధ్యక్షుడు పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి, ఆయన తండ్రి వెంకటేశ్వరరెడ్డితో పాటు నియోజక వర్గానికి చెందిన పలువురు ప్రజా ప్రతినిధులు కట్ చేశారు. అనంతరం పార్టీ కార్యాలయంలో పలువురు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజల నుంచి శుభాకాంక్షలు అందుకున్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయి మార్కొండారెడ్డి, రాష్ట్ర అదనపు విభాగ ప్రధాన కార్యదర్శి యెనుముల మురళీధర్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు శేరెడ్డి గోపిరెడ్డి, దుర్గి, మాచర్ల, వెల్దుర్తి, కారంపూడి, రెంటచింతల మండల పరిషత్ చైర్మన్‌లు సునీత సాయిశంకర్, బూడిద మంగమ్మ, చింతా ఆదినారాయణ, బి. అల్లయ్య, దాసరి చౌడేశ్వరి, మార్కెట్ యార్డు చైర్మన్ తాడి వెంకటేశ్వరరెడ్డి, మున్సిపల్ చైర్మన్ మాచర్ల చిన ఏసోబు, మున్సిపల్ మాజీ చైర్మన్లు తురక కిశోర్, బోయ రఘురామిరెడ్డి, బత్తుల ఏడుకొండలు, షేక్ జలీల్, వైస్ చైర్మన్ పోలూరి నరసింహారావు, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు పోలా శ్రీనివాసరావు పాల్గొన్నారు

- పట్టణంలోని 18వ వార్డులో పీఆర్కే జన్మదినం సందర్భంగా వేడుకల్ని జరిపారు. సెయింటాన్స్ చిన్న కాన్వెంట్‌లో వందలాది మంది విద్యార్థులకు పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేశారు.
- పాతూరులో మదార్‌సా ముస్లింల ఆధ్వర్యంలో పీఆర్కే కేక్ కట్ చేశారు.
- వ్యవసాయ శాఖ ఏడీఏ, ఏవోల ఆధ్వర్యంలో గజ మాలతో సత్కరించి శుభాకాంక్షలను తెలిపారు.
- మాచర్ల నియోజక వర్గ పోలీసు శాఖ సీఐలు, ఎస్ఐల ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించి కేక్ కట్ చేశారు.
- ఆంజనేయ స్వామి దేవాలయంలో వివిధ వార్డుల కౌన్సిలర్ల ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి ప్రభుత్వ విప్ పీఆర్కేకి శుభాకాంక్షలు తెలిపారు.



రెంటచింతలలోని కేక్ కట్ చేస్తున్న నేతలు

కారెంపూడిలో..

మండలంలోని వివిధ గ్రామాల నుంచి పార్టీ నాయకులు, అభిమానులు భారీ సంఖ్యలో మాచర్ల వెళ్లి ప్రభుత్వ విప్ పీఆర్కేకు భారీ పూలమాల వేసి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. జెడ్పీటీసీ సభ్యుడు షేక్ షఫీ వై నాట్ 175 టీ షర్ట్‌లను మాజీ మంత్రి నర్సరావుపేట పార్లమెంట్ ఇన్‌చార్జి అనిల్ కుమార్ యాదవ్, ప్రభుత్వ విప్ పీఆర్కే, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు పిన్నెల్లి వెంకటరామిరెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరింపజేశారు. ఎంపీపీ బొమ్మిన సావిత్రి, మాజీ ఎంపీపీ మేకల శారద, సొసైటీ అధ్యక్షుడు కొమ్మిరెడ్డి నల్లగురవారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు కొంగర సుబ్రమణ్యం, మాజీ ఎంపీపీ పంగులూరి చినవెంకటనర్సయ్య పాల్గొన్నారు.

గురజాలలో..

మాచర్ల శాసనసభ్యుడు, పల్నాడు జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని స్థానిక అనిగ్రేస్ వృద్ధాశ్రమంలో గురువారం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది చల్లా రామిరెడ్డి, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ డైరెక్టర్ కర్రా ప్రగతి , కత్తి చలమరాజు, కె. గిరిబాబు, కె. కుమారస్వామి, సురేష్, జ్ఞానసుందరి పాల్గొన్నారు.

దుర్గిలో ...

సచివాలయం వద్ద వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్ వెలిదండి గోపాల్ కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. నూతనంగా ఏర్పాటు చేసిన వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. పలు గ్రామాల నుంచి ప్రజాప్రతినిధులు, నాయకులు మాచర్ల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పీఆర్కేను కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువజన మండల కన్వీనర్ యకటీల బుచ్చిబాబు, సర్పంచ్ రాయపాటి మాణిక్యం, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

రెంటచింతలలో...

మాచర్ల శాసన సభ్యులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి జన్మదిన వేడుకల్ని పార్టీ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ విగ్రహం వద్ద ఎంపీపీ పాముల సంపూర్ణమ్మ, తాజా మాజీ ఎంపీపీ దాసరి చైడేశ్వరి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు గొట్టం బ్రహ్మారెడ్డి, మాజీ అధ్యక్షులు పూజల రామయ్య, జేసీఎస్ జిల్లా కన్వీనర్ మోర్తల ఉమ కేకును కట్ చేసి పార్టీ కార్యకర్తలకు, అభిమానులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పేర్ల ముత్తయ్య, వైస్ ఎంపీపీ ఏరువ శౌర్రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యులు నవులూరి భాస్కర్‌రెడ్డి, పార్టీ మండల యూత్ అధ్యక్షులు కొమ్మారెడ్డి సతీష్‌రెడ్డి, నేతలు పాల్గొన్నారు.

నియోజకవర్గాన్ని తీర్చిదిద్దాం

గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

పిడుగురాళ్ల: గురజాల నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపించామని ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. స్థానిక కనకదుర్గమ్మ గుడిలోని కల్యాణ మండపంలో గురువారం ఏర్పాటు చేసిన కాపు ఆత్మీయ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని గ్రామాలు, పట్టణాలను ఇచ్చిన మాట ప్రకారం అభివృద్ధి చేసి చూపించామని తెలిపారు. పిడుగురాళ్ల పట్టణంలో ఇంటింటికీ తాగునీటి కుళాయిలు, రోడ్డు విస్తరణ, బైపాస్ రైల్వే బ్రిడ్జి నిర్మాణంతో పాటు జానపాడు రోడ్డులోని రైల్వే బ్రిడ్జి నిర్మాణానికి రూ. 52 కోట్లు మంజూరు చేయించినట్లు చెప్పారు. పనులు కూడా ప్రారంభమయ్యాయని తెలిపారు. నియోజకవర్గవ్యాప్తంగా ఎనిమిది వేల ఇళ్ల పట్టాలు ఇచ్చినట్లు పేర్కొన్నారు. రూ. 19 కోట్లతో రైల్వేస్టేషన్ ఆధునీకరణ, రూ.10కోట్లతో పార్కు నిర్మాణం చేస్తున్నట్లు వివరించారు. పంచాయతీలుగా ఉన్న దాచేపల్లి, గురజాలను నగర పంచాయతీలుగా మార్చినట్లు చెప్పారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి కృష్ణా జలాల్ని అందిస్తున్నామని పేర్కొన్నారు. మొత్తం రూ.3471 కోట్లతో గురజాల నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులు చేశామని ఎమ్మెల్యే కాసు వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు, కాపు నాయకులు పాల్గొన్నారు.

పేదల ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్లు వేగవంతం



రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న తహసీల్దార్ జయవర్ధన్

కారెంపూడి: మండలంలో వైఎస్సార్, జగనన్న కాలనీ లేఅవుట్స్‌లో నివేశన స్థలాల్ని లబ్ధిదారుల పేరుతో రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతంగా జరుగుతోందని కారెంపూడి తహసీల్దార్ జయవర్ధన్ తెలిపారు. కారెంపూడిలో రిజిస్ట్రేషన్ ప్రక్రియను గురువారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బుధవారం సాయంత్రం వరకు 1,603 మంది స్థలాల్ని చేశామని, గురువారం ఆ సంఖ్య మరింత పెరుగుతుందని చెప్పారు. మండలంలోని 15 గ్రామ పంచాయతీల పరిధిలో 21 లేవుట్స్‌లో 2,277 మందికి ప్రభుత్వం వైఎస్సార్, జగనన్న కాలనీలలో నివేశన స్థల పట్టాల్ని ఇచ్చినట్లు ఆయన వివరించారు. పట్టా పొందిన మహిళల పేర్లతో రిజిస్ట్రేషన్లు జరుగుతున్నట్లు తెలిపారు. రిజిస్ట్రేషన్ అధికారాలు పొందిన ఆ గ్రామాల వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు ఆ గ్రామ సచివాలయాల డిజిటల్ అసిస్టెంట్ల సహకారంతో రిజిస్ట్రేషన్లు చేస్తున్నారని పేర్కొన్నారు. ఇంకా స్థల రిజిస్ట్రేషన్లు చేయించుకోని వారుంటే గ్రామాల్లోని సచివాలయాల వద్దకు వెళ్లి చేయించుకోవాలని తహసీల్దార్ సూచించారు. స్థల రిజిస్ట్రేషన్ ద్వారా ఇతర అన్ని హక్కులు సంక్రమిస్తాయని ఆయన పేర్కొన్నారు.

ముగిసిన ఎన్‌ఎస్‌ఎస్ సేవా శిబిరం



బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపాల్ వై.ఎస్.ఎస్. చౌదరి

విజయపురి సౌత్: స్థానిక ఆంధ్రప్రదేశ్ గురుకుల డిగ్రీ కళాశాల ఈ నెల 9న మాచర్ల మండలం బ్రహ్మనందపురం తండాలో ప్రారంభించిన ఎన్.ఎస్.ఎస్. ప్రత్యేక సేవా శిబిరం గురువారంతో ముగిసింది. ఈ ఏడు రోజుల ప్రత్యేక సేవా శిబిరంలో ఎంపికైన 44 మంది ఎన్.ఎస్.ఎస్. వలంటీర్లు స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు, సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొని గ్రామ ప్రజల మన్ననలు పొందారు. ముగింపు కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వై.ఎన్.ఎస్. చౌదరి పాల్గొన్నారు. తమ కళాశాల వలంటీర్ల సేవల్ని ప్రత్యక్షంగా పరిశీలించి అభినందనలు తెలిపారు. వ్యాసరచన, చిత్రలేఖన, నాటక ప్రదర్శనలు, క్రీడల్లో గెలుపొందిన వలంటీర్లకు బహుమతులు, సర్టిఫికెట్లను అందజేశారు. ఎంపీపీ స్కూల్ హెడ్ మాస్టర్ పి. లక్ష్మీదేవి, ఉపాధ్యాయుడు సీహెచ్. శాంతారావు విద్యార్థుల సేవా దృక్పథాన్ని ప్రశంసించారు. గ్రామస్తులను ఉత్తేజ పరిచే నాటకాల ప్రదర్శనలను, వారితో మమేకమై వివిధ నృత్య ప్రదర్శనలలో పాల్గొనడం అభినందనీయమని తెలిపారు. వారం రోజుల పాటు సేవా శిబిరాన్ని విజయవంతంగా నడిపించినందుకు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎస్.ఎం. బాషాకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. అంగన్‌వాడీ టీచర్ సఫీనా బేగం, ఉప సర్పంచ్ బిల్లునాయక్, గ్రామస్తులు పాల్గొన్నారు.

అభినందన సభకు తరలిన వలంటీర్లు



రెంటచింతలలో బస్సుకు పచ్చ జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎంపీపీ సంపూర్ణమ్మ



దాచేపల్లిలో జెండా ఊపి బస్సుని ప్రారంభిస్తున్న చైర్మన్ సాంబయ్య

రెంటచింతల: ఫిరంగిపురం మండలం రేపూడిలో గురువారం రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన అభినందన సభకు పెద్దఎత్తున వలంటీర్లు తరలి వెళ్లినట్లు ఎంపీపీ పాముల సంపూర్ణమ్మ, ఎంపీడీఓ పెదప్రోలు శంకరరావు తెలిపారు. స్థానిక గ్రామ పంచాయితీ కార్యాలయం, మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద ఐదు బస్సుల్ని ఎంపీపీ పాముల సంపూర్ణమ్మ జెండా ఊపి సాగనంపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని 11 గ్రామాలలో విధులు నిర్వహిస్తున్న 268 మంది వలంటీర్లుకు గాను 212 మంది రేపూడి సభకు వెళ్లినట్లు చెప్పారు. వలంటీర్లను సభకు తీసుకువెళ్లి తిరిగి తీసుకు వచ్చే బాధ్యతను కార్యదర్శులు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ పేర్ల చౌడమ్మ, వైఎస్సార్ సీపీ నాయకులు పేర్ల ముత్తయ్య, ఈవోపీఆర్డీ జి. అనంత కోటేశ్వరరావు, కార్యదర్శులు వెంకయ్య, సుబ్బారావు పాల్గొన్నారు.

దాచేపల్లిలో..

ఫిరంగిపురంలో ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి బహిరంగ సభకు గురువారం వలంటీర్లు భారీగా తరలి వెళ్లారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద బస్సులను నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సాంబయ్య, ఎంపీపీ కటకం జయశ్రీ , జెడ్పీటీసీ సభ్యుడు మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డి ప్రారంభించారు.

బంద్‌ను జయప్రదం చేయాలి: సీఐటీయూ

క్రోసూరు: దేశవ్యాప్తంగా శుక్రవారం జరగనున్న బంద్‌లో ప్రజలు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని సీఐటీయూ పల్నాడు జిల్లా ఉపాధ్యక్షుడు జి. రవిబాబు కోరారు. కౌలు రైతు వ్యవసాయ కార్మిక సంఘం, సీఐటీయూ సంఘాల ఆధ్వర్యంలో గురువారం మండలంలో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా రవిబాబు మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మికులు, రైతుల హక్కుల్ని కాలరాసే అనేక చట్టాల్ని తీసుకొచ్చిందని విమర్శించారు. రైతు సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో 13 నెలల పాటు దేశ రాజధాని ఢిల్లీలో పెద్ద పోరాటం జరిగితే నల్ల చట్టం రద్దు చేస్తానని, పంటలు గిట్టుబాటు ధర చట్టం తీసుకొస్తానని, ఇతర హామీలను ఇచ్చిన మోదీ అమలు చేయకుండా రైతన్నను మోసం చేశారని చెప్పారు. మోదీ మోసపూరిత విధానాల వల్లే తిరిగి ఢిల్లీలో రైతుల పోరాటం ప్రారంభమైయిందని పేర్కొన్నారు. కార్మికులకు అనుకూలంగా ఉన్న చట్టాలు మార్చి, యజమానుల వద్ద బానిసలుగా మారే విధంగా కోడ్‌లుగా మార్చిందని తెలిపారు. వీటిని వ్యతిరేకిస్తూ రైతు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో దేశవ్యాప్త గ్రామీణ బంద్‌కు పిలుపునిచ్చినట్లు వివరించారు.

నరసరావుపేట మార్కెట్ యార్డు చైర్మన్‌గా వాసుదేవరెడ్డి

నరసరావుపేట: స్థానిక మార్కెట్ యార్డు చైర్మన్‌గా ఉప్పలపాడు గ్రామానికి చెందిన శనివారపు వాసుదేవరెడ్డి నియమితులయ్యారు. గురువారం పార్టీ కార్యాలయంలో ప్రభుత్వం జారీచేసిన నూతన కార్యవర్గ ఉత్తర్వులను వాసుదేవరెడ్డికి ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అందజేశారు. కార్యవర్గంలో పలు గ్రామాలు, పట్టణానికి చెందినవారు నియమితులయ్యారు. ఉపాధ్యక్షులుగా పులుసు అన్నపూర్ణమ్మ, డైరెక్టర్లుగా పి.రామయ్య, సక్కా వెంకటేశ్వరరావు, బత్తుల పద్మలత, షేక్ బీబీ ఆశ, కుంభ శ్రీనివాసరావు, పెనుగొండ ప్రభాకర్, తడికమల్ల చిన్నకోటేశ్వరరావు, బి.రామనాగేశ్వరరావు నియమితులయ్యారు. రైతులకు అర్బికేల ద్వారా సబ్సిడీపై విత్తనాలు, వ్యవసాయ పనిముట్లు, ఎరువులు, పురుగు మందులు అందిస్తూ వారికి మేలు చేయాలని కోరారు. తనపై నమ్మకాన్ని ఉంచి యార్డు చైర్మన్‌గా నియమించిన ఎమ్మెల్యే గోపిరెడ్డి, ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి వాసుదేవరెడ్డి, ఆర్యవైశ్య నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. పల్నాడు జిల్లా అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ మిట్టపల్లి రమేష్, ఉప్పలపాడు గ్రామ సర్పంచ్ వడ్డే దేశింగరావు, రైస్ మిల్లర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఊర బాస్కరరావు, నాయకులు పెనుగొండ వెంకటేశ్వరరావు, వద్దుల సుబ్బారెడ్డి, శనివారపు వీరారెడ్డి, సుబ్బారెడ్డి, దేవరపల్లి శ్రీనివాస్‌రెడ్డి, వి.సాంబశివరావు, దివ్వెల రామకృష్ణ, మిరియాల నరహరిరావు, పాల్గొన్నారు.

ఇంటింటికీ ఫ్యామిలీ డాక్టర్ సేవలు



పాటిబండ్లలో సర్వే నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

పెదకూరపాడు: తాత ఆరోగ్యం ఏలా ఉంది. మందులు వేసుకుంటున్నావా? ఎ మందులు వాడుతున్నావు.... అమ్మ షుగర్ చేక్ చేసుకున్నావా? బీపీ ఎలా ఉంది? పిల్లలకు జ్వరాలు ఉన్నాయా? దగ్గు, జలుబు ఉందా? కుండీల్లో, డబ్బాలో నీరు నిల్వ ఉండకుండా చూడండి..అంటూ ప్రతి ఇంటిని వైద్య సిబ్బంది జల్లెడపడున్నారు ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా వైద్య సిబ్బంది మండలంలోని పాటిబండ్లలో బుధ, గురువారం వైద్య సేవలందించారు. 1900 ఇళ్లకు మెడికల్ కాలేజీ హౌస్ సర్జన్‌లు వెళ్లి ఉచితంగా వైద్య సేవలందిస్తున్నారు.దీంతో పాటు మండలంలోని 20 గ్రామాల్లో వైద్య సిబ్బంది సర్వే చేస్తున్నారు. సాధారణ వ్యాధులతో పాటు సీజనల్, దీర్ఘకాలిక వ్యాధుల నివారణకు కృషి చేస్తున్నారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ వెలిగొండరెడ్డి, డాక్టర్ అదిత్య మాట్లాడుతూ వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పేద ప్రజల ఆరోగ్యం కోసం అనేక కార్యక్రమాలు నిర్వహిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ వినయ్, దిలీప్, శ్రీనివాసరావు, ఆశ, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు అనుపాలెంలో జగనన్న సురక్ష ఆరోగ్య శిబిరం

రాజుపాలెం: మండలంలోని అనుపాలెం గ్రామ సచివాలయం పరిధిలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ప్రాథమిక వైద్యాధికారి కె.వి.కృష్ణకుమార్ తెలి పారు. శిబిరంలో పిల్లల డాక్టర్, ఆర్థోపెడిక్, జనరల్ శస్త్ర చికిత్స వైద్యులు పాల్గొంటారని పేర్కొన్నారు. గర్భిణులు, బాలింతలకు పరీక్షలతో పాటు షుగర్‌కు, బీపీకి మందులు కూడా ఇవ్వనున్నట్లు చెప్పారు. గ్రామస్తులంతా శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఈకేవైసీ నమోదుకు గడువు పొడిగింపు

నకరికల్లు: రబీలో సాగు చేసిన పంటలకు ఈకేవైసీ నమోదు చేసుకునేందుకు ఈ నెల 20వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు గురువారం తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఇప్పటివరకు 7,187 ఎకరాల్లో ఈ క్రాప్ నమోదైందని పేర్కొన్నారు. ఇప్పటి దాకా 5,830 ఎకరాలకు మాత్రమే ఈకేవైసీ పూర్తయిందన్నారు. మిగిలిన రైతులంతా త్వరితగతిన చేయించుకోవాలని, లేనిపక్షంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందవని ఆయన తెలిపారు.